



# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట

I | హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 | SIDDIPET






సిద్దిపేట కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్

## అమరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్రం

- తెలంగాణ సాధనలో సిద్దిపేట జిల్లాకు ప్రత్యేక స్థానం
- కవులు, మేధావులకు నిలయం జిల్లా
- తొలి, మలిదశ ఉద్యమాల్లో నాయకత్వం వహించిన గడ్డ
- అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలో సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, జూన్ 2 : ఎందరో అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో దశదిశలా విరాజిల్లుతుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేడు తెలంగాణ రాష్ట్రం దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నదని చెప్పడానికి గర్వపడుతున్నానని తెలిపారు. తెలంగాణ అనేది ఒక భౌగోళిక స్వరూపం మాత్రమే కాదని.. తెలంగాణ అంటే ఒక అస్తిత్వ పోరాట రూపమన్నారు. తెలంగాణలో ప్రత్యేక సంస్కృతి, సాంప్రదాయాలు, సాహిత్యం కలిగి ఉండి.. తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ లాంటి భాషలు మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వంగా దేశంలో ఒక విశిష్టతను కలిగి ఉందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అన్నివర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారని, బలిదానాల ఫలితంగా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఆరు దశాబ్దాల కల నెరవేరిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సిద్దిపేట జిల్లా ప్రజలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనాదిగా కవులకు, మేధావులకు నిలయం సిద్దిపేట అన్నారు. జిల్లాలో సాంస్కృతిక, సాహిత్య చైతన్యం ఎక్కువ అని, ఆ ప్రభావంతో సిద్దిపేట జిల్లా ప్రజలు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో నాయకత్వం వహించి రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారని కలెక్టర్ గుర్తుచేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ, సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## అమరులకు నివాళులర్పించిన హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి అమరులను స్మరించుకున్నారు.

## కేసీఆర్ పోరాటంతోనే సాకారం

### ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర సాధనకే ఆనాడు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని, కేసీఆర్ పట్టుదలతో 14ఏండ్ల నిరంతర పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయజెండా ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో 1969 నుంచి అనేక మంది అమరులయ్యారని, అప్పటి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా అనిపించలేదన్నారు. కేసీఆర్ చేపట్టిన ఉద్యమ ఫలితంగానే రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. మలిదశ ఉద్యమంలో అనేక పోరాటాలు చేయడంతోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు ముందుకొచ్చి ప్రకటన చేసిందన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి ప్రతి కుటుంబానికి న్యాయం చేశారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో సాగు నీరందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో వ్యతిరేకత మొదలైందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీల ఊసేత్తడం లేదన్నారు. రైతులు విత్తనాల కోసం రోడ్ల మీదికి వస్తున్నారని, ప్రభుత్వం రైతులు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి




## హుస్నాబాద్‌లో దంచికొట్టిన వాన

- గంటన్నర పాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం
- చెరువును తలపించిన హుస్నాబాద్‌లోని మెయిన్ రోడ్డు, బస్టాండు ప్రాంతం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- చల్లబడిన వాతావరణం.. సేద తీరుతున్న జనం

హుస్నాబాద్, జూన్ 2: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి వరకు కూడా కరెంటు రాలేదు. హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డు, బస్టాండ్ ప్రాంతం వరద నీటితో చిన్నపాటి చెరువును తలపించింది. మెయిన్ రోడ్డులో హైవే పనులు కొనసాగుతున్నందున రోడ్డుపైకి వర్షపు నీరు పెద్ద మొత్తంలో చేరడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇండ్లలోకి వరద చేరింది. చాలారోజుల తర్వాత భారీ వర్షం పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడి ప్రతాపంతో భగభగ మండిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో జనం ఉపశమనం పొందారు. రాత్రి వరకు కూడా ఉరుములు మెరుపులు కొనసాగాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షంతో రైతుల్లో నూతనోత్సాహం వచ్చినట్లు అయింది. రేపటి నుంచి ఆరుతడి పంటల సాగు కు సన్నద్ధం కానున్నారు.


వర్షం నీటితో చెరువును తలపించిన హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డు

### పిడుగుపాటుతో పాడి గేదె మృతి



పిడుగుపాటుతో మృతిచెందిన పాడి గేదె

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 2 : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లలో ఆదివారం పిడుగు పాటుతో పాడిగేదె మృతిచెందింది. వల్లపట్లకు చెందిన నారదాసు రవి రోజు మాదిరి గానే తన పాడిగేదెను వ్యవసాయబావి వద్ద కట్టేశాడు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఉన్న పాడిగేదె పిడుగు పాటుకు గురై మృతి చెందింది. దీని విలువ రూ.90వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.


హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న హైవే పనులతో దుకాణాల సముదాయం వద్ద నిలిచిన నీరు

### కోహెడలో వర్షం

కోహెడ, జూన్ 2: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు అరగంట సేపు కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవి ఉక్కపోత, ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కురిసిన వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. పట్టణంలో కోహెడ నుంచి కరీంనగర్ వెళ్లే దారిలో పిడుగుపడటంతో అదే ప్రాంతంలో ఉన్న పెంట్రోల్ పంప్‌లో సిస్టమ్స్ దెబ్బతిన్నాయి. ఆదివారం సంతకు వచ్చిన వ్యాపారులు, ప్రజలకు ఇబ్బంది కలిగింది.


గుమ్మడిదలలో దంచికొట్టిన వాన

### ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

సిద్దిపేట, జూన్ 2 : సిద్దిపేట పట్టణంతో పాటు ఆయా మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోజంతా ఎండగా ఉండి సాయంత్రం వాన పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సిద్దిపేటలో కురిసిన వర్షానికి రోడ్లపై వర్షం నీళ్లు పారాయి.


సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

### గుమ్మడిదలలో జోరు వాన

గుమ్మడిదల, జూన్ 2 : నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలతో పాటు పలు గ్రామాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన వాన కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. రైతులు వానకాలం పంటలకు సిద్ధపడుతున్నారు. యాసంగి సీజన్‌లో పండించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

